# ‘చాగంటి’కి స్వాగతం

- ఆధ్యాత్మిక, ధార్మిక ప్రవచన శిఖరం
- ఉపన్యాస చక్రవర్తి చాగంటి కోటేశ్వరరావు
- మానవాళికి మీ ప్రవచనాలు అమృతం
- ఆర్థిక, వైద్యారోగ్యశాఖల మంత్రి హరీశ్‌రావు
- సిద్దిపేట మూడురోజుల పాటు ప్రవచనాలు
- చాగంటికి ఘన స్వాగతం పలికిన మంత్రి



చాగంటి కోటేశ్వరరావు దంపతులతో మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేట, సెప్టెంబర్ 30 : బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వర రావు ప్రవచనాలు మానవీయ విలువలకు ప్రేరణ ఇస్తాయని, వారు సిద్దిపేటలో ప్రవచనాలు చెప్పడం ఇక్కడి ప్రజలు చేసుకున్న గొప్ప అదృష్టమని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి హరీశ్‌రావు అన్నారు. నేటి నుంచి మూడు రోజుల పాటు సిద్దిపేట పట్టణంలో మానవ విలువలపై ప్రవచనాలు వినిపించడానికి వచ్చిన బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావును రంగనాయకసాగర్ వద్ద ఇరిగేషన్ గెస్ట్‌హౌస్‌లో మంత్రి స్వాగతం పలికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ చాగంటి సిద్దిపేటకు రావడం గొప్ప అదృష్టమని, ఈ ప్రాంతం చేసుకున్న పుణ్యమని, మీ ప్రవచనాలు గొప్ప ప్రేరణను కలిగిస్తాయన్నారు. చాగంటి కోటేశ్వరరావు ధారణ శక్తి, జ్ఞాపకశక్తి చెప్పుకోదగ్గవి, మానవ ధర్మంపై ఆసక్తితో అష్టాదశ పురాణాలను అధ్యయనం చేసి, తనదైన శైలిలో సామాన్యులకు సైతం అర్థమయ్యే రీతిలో ప్రవచనాలు ఇస్తూ, భక్తుల మనస్సును దోచుకుంటున్నారన్నారు. సిద్దిపేట ప్రజలకు మానవత్వం విలువలపై ప్రవచనాలు వినిపించడానికి వచ్చినందుకు చాగంటికి కృతజ్ఞతలు తెలిపారు. భగవంతుడి ఆశీస్సులతో సిద్దిపేట విద్య, వైద్యం మౌలిక వసతుల కల్పన, సాగునీరు, వ్యవసాయంతోపాటు ఆధ్యాత్మిక రంగంలో గణనీయమైన అభివృద్ధి సాధించిందని, సిద్దిపేట ప్రజలు ఆధ్యాత్మిక భావనతో సత్ప్రవర్తన కలిగి ఉండి జిల్లా అభివృద్ధిలో ప్రభుత్వానికి సహకరిస్తున్నారని తెలిపారు. గోదావరి నదిపై కాళేశ్వరం నిర్మించి సీఎం కేసీఆర్ తెలంగాణలో కరువుకు శాశ్వత సెలవుగా చూపించారన్నారు. మూడు రోజులు సౌకర్యవంతంగా ఉండడానికి ఏర్పాట్లు చేశామని, కుటుంబ సభ్యులతో సిద్దిపేటలోని కోమటిచెరువు పర్యాటక కేంద్రాన్ని వీక్షించి, ప్రజలకు ఆధ్యాత్మిక సందేశాన్ని ఇవ్వాలని మంత్రి హరీశ్‌రావు కోరారు. రామాయణం, భాగవతం, సుందర కాండ ప్రవచనాలు ప్రజల్లో చైతన్యం కలిగిస్తాయని తెలిపారు. సిద్దిపేటలో మీరు చెప్పే ప్రవచనాలు ప్రేరణ కలిగిస్తాయని ఆశిస్తున్నట్లు మంత్రి హరీశ్‌రావు తెలిపారు.

## మీ ప్రగతిని విన్నాం.. చూస్తున్నాం

★ బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

సిద్దిపేటను ఎంతో చక్కగా అభివృద్ధి చేస్తున్నారు.. మీ ప్రగతి గురించి విన్నాము.. మిమ్మల్ని కలవాలని ఎన్నో రోజులుగా అనుకుంటున్నానని మంత్రితో చాగంటి తన ఆసక్తిని పంచుకున్నారు. దేవుడి దయతో మీరు ఆధ్యాత్మిక ప్రవచనాలు ఇవ్వాలని అడిగిన వెంటనే సిద్దిపేటకు వచ్చానని, సిద్దిపేటలో జరిగిన అభివృద్ధి అన్ని ప్రాంతాల్లో జరగాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇలాంటి అభివృద్ధిని సాధించిన మీకు ప్రత్యేక అభినందనలు... మా ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉంటాయని పేర్కొన్నారు.

## మెదక్ జిల్లాలో పోలీస్ యాక్ట్ అమలు

- ఎస్పీ రోహిణిప్రియదర్శిని

మెదక్ అర్బన్, సెప్టెంబర్ 30 : మెదక్ జిల్లాలో శాంతిభద్రతలను దృష్టిలో పెట్టుకొని నెల రోజులపాటు అక్టోబర్ 1 నుంచి 30వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా 30, 30(ఏ) పోలీస్ యాక్ట్ (1861) అమలులో ఉంటుందని ఎస్పీ రోహిణి ప్రియదర్శిని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసు అధికారుల అనుమతి లేకుండా ప్రజలు ఎలాంటి ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్‌లు, సభలు, సమావేశాలు నిర్వహించవద్దన్నారు. శాంతిభద్రతలకు భంగం కలిగిస్తూ ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించే చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టవద్దని హెచ్చరించారు. ప్రజలు, ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు పోలీసులకు సహకరించాలని ఎస్పీ రోహిణి ప్రియదర్శిని కోరారు.

# ప్రతి రైతుకూ పంట రుణం ఇవ్వాలి

- జిల్లాలో 80,857 మంది రైతులకు
- రూ.471 కోట్ల 71 లక్షల పంట రుణమాఫీ
- రుణమాఫీ జరిగిన రైతులకు రుణాలు ఇవ్వాలి
- టెలీ కాన్ఫరెన్స్‌లో బ్యాంకర్లతో కలెక్టర్ శరత్



సంగారెడ్డి కలెక్టరేట్, సెప్టెంబర్ 30 : సంగారెడ్డి జిల్లాలో అర్హత ఉన్న ప్రతి రైతుకూ పంట రుణం ఇవ్వాలని బ్యాంకర్లకు కలెక్టర్ డాక్టర్ శరత్ సూచించారు. శనివారం రుణమాఫీ, పంట రుణాల పురోగతిపై వ్యవసాయశాఖ అధికారులు, ఎల్‌డీఎం, వివిధ బ్యాంకుల కంట్రోలింగ్ అధికారులతో కలెక్టర్ శరత్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రుణమాఫీ జరిగిన రైతులందరికీ 100శాతం కొత్తగా పంట రుణాలు ఇవ్వాలని బ్యాంకర్లను ఆదేశించారు. జిల్లాలో ఇప్పటి వరకు 80,857 మంది రైతులకు రూ.471 కోట్ల 71 లక్షల రుణమాఫీ జరిగిందన్నారు. ఇందులో 70 శాతం మందికి కొత్త రుణాలు ఇవ్వగా, మిగతావారికి కూడా రుణాలు అందించాలన్నారు. డీబీటీ (డైరెక్ట్ బెనిఫిట్ (ట్రాన్స్‌ఫర్) ఫెయిల్యూర్ రైతుల వివరాలను ఆయా బ్యాంకర్లు లీడ్ బ్యాంక్ మేనేజర్‌కు అందించాలని కలెక్టర్ ఆదేశించారు. బ్యాంకు, బ్రాంచీ, ఎంతమంది రైతులకు ఎంత రుణమాఫీ అయిందనే వివరాలు అందించాలన్నారు. పంట రుణాలు ఇచ్చిన రైతుల జాబితా, రైతుకు సంబంధించిన వివరాలు, ఎంత రుణం ఇచ్చారు అనే వివరాలను వ్యవసాయాధికారులకు అందించాలని బ్యాంకు అధికారులకు సూచించారు. వ్యవసాయ ధికారులు, బ్యాంకర్లతో సమన్వయం చేసుకుంటూ రుణమాఫీ జరిగిన రైతులందరికీ కొత్తగా పంట రుణాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. టెలీ కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ఎల్‌డీఎం గోపాల్‌రెడ్డి, వ్యవసాయశాఖ జేడీ నర్సింహారావు, వివిధ బ్యాంకుల అధికారులు, వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు ఉమ్మడి జిల్లా జట్లు

- స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో క్రీడాపోటీలకు క్రీడాకారుల ఎంపిక
- ఉమ్మడి మెదక్ జిల్లా క్రికెట్ జట్లకు 16 మంది బాలికలు, 16 మంది బాలురు



విజేతలకు బహుమతులను అందజేస్తున్న తారా కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం

సంగారెడ్డి కలెక్టరేట్/ పటాన్‌చెరు, సెప్టెంబర్ 30 : జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఇండియా ఆధ్వర్యంలో శనివారం పటాన్‌చెరు పట్టణంలో నిర్వహించిన ఉమ్మడి మెదక్ జిల్లా స్థాయి క్రికెట్ పోటీలకు 200 మంది క్రీడాకారులు హాజరయ్యారు. అండర్-14 బాలుర విభాగంలో 16 మంది, అండర్ -17 బాలికల విభాగంలో 16 మంది చొప్పున క్రీడాకారులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి అమూల్యమ్మ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాస్థాయిలో ఎంపిక చేసిన అండర్-14 బాలుర, అండర్-17 బాలికల జట్లు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాయన్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించాలని ఆకాంక్షించారు. ఎంపికల్లో పీఈటీలు కె.నర్సింహ, శ్రీనివాస్‌గౌడ్, నాగరాజు, శివకుమారి, రమేశ్, రాజాగౌడ్, రవి, కరుణాకర్, రామరాజు, సంతోష్‌రెడ్డి, పవన్ తదితరులు పాల్గొన్నారు.

### రాష్ట్రస్థాయి పోటీలకు ‘తారా’ విద్యార్థులు

సంగారెడ్డి జిల్లా ఎయిడ్స్ ప్రివెన్షన్, కంట్రోల్ యూనిట్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయిలో నిర్వహించిన పోటీల్లో తారా ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ఎస్ రత్నప్రసాద్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్ఐవీ-ఎయిడ్స్‌పై అవగాహన కల్పించేందుకు జిల్లాస్థాయిలో వివిధ పోటీలు నిర్వహించారని తెలిపారు. రీల్ మేకింగ్‌లో సింధు బృందం ప్రథమ బహుమతి సాధించారని పేర్కొన్నారు. స్కిట్ కాంపిటీషన్‌లో రాజేశ్ బృందం ప్రథమ బహుమతులు సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ రత్నప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాళ్లు ప్రవీణ, డాక్టర్ వెంకటేశం, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి డేనియల్, ఎన్ఎస్ఎస్ అధికారులు





రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైన ఉమ్మడి జిల్లా బాలుర, బాలికల జట్లు

## ప‘రేషన్’ అవసరం లేదు..!

డిసెంబర్ 31వరకు రేషన్‌కార్డు ఈకేవైసీ చేసుకోవచ్చు

మెదక్ అర్బన్, సెప్టెంబర్ 30 : ప్రభుత్వ ఆదేశాలతో డిసెంబర్ 31వ తేదీ వరకు రేషన్‌కార్డు ఈకేవైసీ నమోదు చేసుకోవచ్చని కలెక్టర్ రాజర్షిషా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ-కేవైసీ రేషన్ కార్డులోని కుటుంబ సభ్యులందరూ స్థానికంగా ఉన్న రేషన్ షాప్‌లకు వెళ్లి వెలిముద్రల ద్వారా నమోదు చేసుకోవాలన్నారు. వెలిముద్ర పడకపోతే రేషన్ షాప్‌లో ఉన్న ఐరిస్ యంత్రం ద్వారా చేసుకోవచ్చని సూచించారు. ఈకేవైసీ నమోదు ఆధారంగా రేషన్ కార్డు తీసివేయడం లేదా కుటుంబ సభ్యుల పేర్లను తీసివేయమన్నారు. రేషన్‌కార్డు ఉన్నవారు ఎలాంటి ఒత్తిడి, భయాందోళన చెందాల్సిన అవసరం లేదని సూచించారు. గతంలో ఉన్నట్లుగానే రేషన్‌కార్డులో పేర్లు నమోదైనవారిలో ఎవరైనా ఒకరు రేషన్‌షాప్ వెళ్లి రేషన్ తీసుకోవచ్చన్నారు. రేషన్ డీలర్లు తమ దగ్గరకు వచ్చిన కార్డుదారులను మీసేవ కేంద్రానికి పంపకుండా ఈకేవైసీ ప్రక్రియ రేషన్ షాప్‌లోనే పూర్తి చేయించాలని సూచించారు. రేషన్‌కార్డుల్లో ఉన్నవారి వెలిముద్ర పడకపోతే ఐరిస్ యంత్రం ద్వారా ఈకేవైసీ చేయాలని రేషన్ డీలర్లకు కలెక్టర్ రాజర్షిషా సూచించారు.

## ‘నేషనల్ మీన్స్ కమ్ మెరిట్’ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

మెదక్ అర్బన్, సెప్టెంబర్ 30 : నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ పరీక్ష కోసం 2023-24 సంవత్సరానికి సంబంధించిన 8వ తరగతి విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులను ప్రభుత్వ పరీక్షల సంచాలకులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, ఎయిడెడ్, ఆదర్శ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు పరీక్ష రాయడానికి అర్హులన్నారు. జనరల్, బీసీ అభ్యర్థులు రూ.100, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులు రూ. 50 చొప్పున పరీక్ష ఫీజును ఆన్‌లైన్ ఎస్బీఐ కలెక్ట్ ద్వారా చెల్లించాలన్నారు. డిమాండ్ డ్రాఫ్టు అంగీకరించమని పేర్కొన్నారు. అభ్యర్థులు http://bse.telangan.gov.in వెబ్‌సైట్ ద్వారా అక్టోబర్ 13వ లోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి సూచించారు.

## ఐటీఐలో ‘వాక్ ఇన్’ ప్రవేశాలు

మెదక్ అర్బన్, సెప్టెంబర్ 30 : ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో ఖాళీగా ఉన్న సీట్లను వాక్ ఇన్ పద్ధతిలో ఈ నెల 9వ తేదీ నుంచి అడ్మిషన్లు ప్రారంభమవుతాయని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు నేటి నుంచి 8వ తేదీలోపు iti.telangana.gov.in వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని కోరారు. ఆన్‌లైన్‌లో వివరాలను నమోదు చేసుకున్న అభ్యర్థులు తప్పనిసరిగా అప్లికేషన్ ప్రింటెడ్ కాపీతోపాటు ఒరిజినల్ సర్టిఫికెట్లతో మెదక్‌లోని ప్రభుత్వ ఐటీఐ కళాశా లకు వాక్ఇన్ అడ్మిషన్లకు హాజరుకావాలన్నారు.

## నిందితుడికి షోకాజ్ నోటీసు

- రూ. లక్ష జరిమానా విధించిన తహసీల్దార్
- పోలీస్‌స్టేషన్‌లో జరిమానా చెల్లించిన నిందితుడు



తహసీల్దార్‌కు జరిమానా రసీదు అందజేస్తున్న నిందితుడు

రామాయంపేట, సెప్టెంబర్ 30 : కొన్ని రోజులుగా ఓ వ్యక్తి పలు కేసుల్లో నిందితుడిగా ఉన్నట్లు రామాయంపేట ఎస్సై రంజిత్ శనివారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు..

రామాయంపేట మండలంలోని దామరచెర్వు గ్రామానికి చెందిన తీగుళ్ల హరీశ్ గతంలో వివిధ నేరా లకు సంబంధించిన కేసుల్లో నిందితుడు. ఆయా కేసుల్లో నిందితుడి హరీశ్‌ని అరెస్టు చేసి తహసీల్దార్ ఎదుట ప్రవేశపెట్టామన్నారు. మళ్లీ నేరాలు చేస్తే లక్ష రూపాయల జరిమానా విధిస్తామని హెచ్చరించి పంపించినట్లు ఎస్సై తెలిపారు. కాగా, నిందితుడు తన ప్రవర్తనను మార్చుకోకుండా మళ్లీ దొంగతనాలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. దీంతో నిందితుడిని అదుపులోకి తీసుకుని రామాయంపేట తహసీల్దార్ ఎదుట ప్రవేశపెట్టగా రూ.లక్ష నగదు చెల్లించినట్లు వివరించారు. గత ఫిబ్రవరిలో ఒక కేసులో నిందితుడిని తహసీల్దార్ ఎదుట ప్రవేశపెట్టామన్నారు. హరీశ్ ఇటీవల మరో కేసులో మద్దాయిగా తేలడంతో తహసీల్దార్ ఎదుట శనివారం ప్రవేశపెట్టగా రూ.లక్ష జరిమానా విధించినట్లు తెలిపారు. పూర్తిగా మారాలని నిందితుడిని హెచ్చరించినట్లు సీఐ రంజిత్ తెలిపారు.